పార్కుపై ‘ప్రైవేటు’ కన్ను





పార్కులో క్రషర్ యాష్ వేసి లెవెల్ చేస్తున్న కూలీలు

- పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద పార్కులో చకచకా పనులు
- అభివృద్ధి పేరుతో గ్రౌండ్‌గా మార్చేసేందుకు ఓ స్కూల్ యాజమాన్యం యత్నం
- ఎమ్మెల్యే అనుచరులతో డీల్



ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం పాగా వేసేందుకు ప్రయత్నిస్తున్న పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద గల జీవీఎంసీ పార్కు ఇదే

మధురవాడ: ఇప్పటి వరకూ కొందరు అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులు ప్రభుత్వ భూములను ఆక్రమించడం మాత్రమే చూశాం. వారిని ఉపయోగించుకుని ప్రభుత్వ స్థలాలు, పార్కులను ఎలా తమ వ్యాపార అవసరాలకు వాడుకోవాలో కొందరు ప్రైవేటు వ్యక్తులు చేసి చూపించి నేడు కొత్త భాష్యం చెబుతున్నారు. ఈ సంస్కృతికి తెరలేపింది పీఎం పాలేనికి చెందిన ఓ ప్రముఖ విద్యా సంస్థ కావడం విశేషం. కనీసం ఇండోర్ గేమ్స్‌కు అవకాశం లేకుండా లక్కపిడతల్లా ప్రైవేట్ స్కూళ్ల భవనాలు కడుతున్నారు. దీంతో పిల్లలకు కనీసం ఆటలాడుకునేందుకు స్థలాలు లేకపోవడంతో ఇప్పుడు వారి చూపు ప్రభుత్వ పార్కులు, విలువైన స్థలాలపై పడింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పక్కనే ఉన్న సుమారు రూ.5 కోట్ల విలువైన అర ఎకరం పైనే విస్తీర్ణం గల ప్రభుత్వ పార్కుపై కన్నేశారు.

స్కెచ్ ఇలా..

పాఠశాల పిల్లలు నేరుగా పార్కుల్లోకి వచ్చి ఆటలాడుకోవడానికి నిబంధనలు అనుమతించవు కాబట్టి స్థానిక ఎమ్మెల్యే అనుచరులతో డీల్ కుదుర్చుకుని జీవీఎంసీ పార్కును ఆట స్థలంగా మార్చుకునేందుకు పథకం రచించారు. ఇందులో భాగంగా అధికార పార్టీ నాయకులతో సిఫార్స్ చేయించుకుని ఈ పార్కును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. అనుకున్నదే తడవుగా ఇలాంటి పార్కులు ఎన్నో ఉన్నా.. వాటిని పట్టించుకోకుండా కేవలం ఈ పాఠశాల వద్ద పార్కు మీదే జీవీఎంసీ అధికారులకు అత్యంత ప్రేమ పుట్టుకొచ్చేసింది. దీంతో జోనల్ కమిషనర్ ఇటీవల ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడితో వలసి వెళ్లి ఆఘమేఘాల మీద పార్కులో జంగిల్ క్లియరెన్స్ చేయించారని పెద్ద ప్రచారమే సాగుతోంది. ఈ రకంగా ప్రభుత్వ పార్కును ఆట స్థలంగా మార్చేసేందుకు అనధికారిక అనుమతులు ఇవ్వకనే ఇచ్చేశారు. ఇంకేముంది సదరు పాఠశాల యాజమాన్యం ఆటల కోసం కోర్టుల నిర్మాణానికి రెండు రోజులుగా చకచకా చర్యలు ప్రారంభించింది. క్రషర్ యాష్‌తో పార్కు స్థలమంతా నింపి పనులు ప్రారంభించారు. అన్ని వర్గాల నుంచి తీవ్రంగా వ్యతిరేకత రావడంతో ఇప్పుడు నాలుక కరుచుకుని దిద్దుబాటు చర్యలు ఎలా చేపట్టాలా.. అని జీవీఎంసీ అధికారులు, టీడీపీ నాయకులు దీర్ఘాలోచనలో పడ్డారు. ఈ వ్యవహారాన్నంతటినీ పక్క వార్డుకు చెందిన సూపర్ కార్పొరేటర్ అనుచర వర్గమే చేసిందన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. వీరికి తామేమీ తీసిపోమన్నట్టు పీఎం పాలెం ఆఖరి బస్టాప్ నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న మరో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం కూడా పార్కు స్థలాన్ని తమ ఆట స్థలంగా ఉపయోగించుకుంటోంది. ప్రభుత్వ స్థలాలను అడ్డదారుల్లో ప్రైవేటు వ్యక్తులకు అనధికారికంగా కట్టబెట్టేందుకు కారకులైన అధికారులు, సిబ్బందిపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేస్తామన్నారు



పార్కును పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేయడానికి సదరు పాఠశాల యాజమాన్యం ముందుకొచ్చింది. చేసిన తర్వాత అక్కడ ఉన్న ప్రజలందరితోపాటు పాఠశాల పిల్లలు ఆడుకోవడానికి అభ్యంతరం లేదని చెప్పామే తప్పా.. పాఠశాల పిల్లలు మాత్రమే ఆడుకోవడానికి ఇస్తామని చెప్పలేదు. అక్కడ పనులు చేయడానికి కూడా మేము అనుమతి ఇవ్వలేదు. పనులు నిలిపి వేయించి, పార్కుకు తాళం వేయిస్తాం.

– పి.సింహాచలం, జోన్–2 కమిషనర్, జీవీఎంసీ

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో బాలబాలికల సర్వతోముఖాభివృద్ధి



రాబర్ట్ స్టీఫెన్సన్ పోవెల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తగరపువలస: దేశభక్తి, క్రమశిక్షణ, ఆరుబయట నివాసం, సమాజ సేవ, జాతీయ సమైక్యత, చేతికళలు, ప్రావీణ్యత చిహ్నాలు, ప్రథమ చికిత్స, వంటలు, శిబిర నివాసం, మ్యాపింగ్, సిగ్నలింగ్, సాహస కృత్యాలు, ప్రకృతి పరిశీలన వంటి వాటిలో బాలబాలికలు రాటు తేలాలంటే అది స్కౌట్స్ అండ్ గైడ్స్ దశలోనే సాధ్యమని భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం మురళీధర్ తెలిపారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పాఠశాలలో విద్యార్థులచే స్కౌట్స్ పితామహుడు రాబర్ట్ స్టీఫెన్సన్ పోవెల్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జెండా ఆవిష్కరించారు. హెచ్ఎం మాట్లాడుతూ 1907లో ఇంగ్లాండ్‌లో ప్రారంభమైన స్కౌట్ ఉద్యమం మనదేశంలో 1909లో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా అబ్దుల్ కలాం, స్పోర్ట్స్ నాయకులు కలిసి స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను ఏకం చేశారన్నారు. పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్, హెడ్ క్వార్టర్ కమిషనర్ టీవీఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ మనదేశంలో బాలబాలికలకు 3 నుంచి 25 ఏళ్ల వరకు మూడు దశల్లో బన్నీస్గాను, బుల్బుల్స్, రోవర్స్/రేంజర్స్‌గా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

బీచ్ రోడ్డులో ఆనంద్ దేవరకొండ సందడి



డ్యూయెట్ సినిమా షూటింగ్‌లో ఆనంద్ దేవరకొండ

కొమ్మాది: ఆర్.కె.బీచ్ రోడ్డులో గురువారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. మిదున్ వరదరాజు కృష్ణన్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న డ్యూయెట్ అనే సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా ఆనంద్ దేవరకొండ, హీరోయిన్‌గా రితిక నాయక్ నటిస్తున్నారు. ఆనంద్ దేవరకొండ బైక్‌పై బీచ్ రోడ్డులో ప్రయాణించే సన్నివేశాలను షూట్ చేశారు. ప్రయాణికులు, పర్యాటకులు పెద్ద ఎత్తున బీచ్ రోడ్డుకు చేరుకుని మూవీ షూటింగ్‌ను తిలకించారు.

వీవోఏల నిరసన



వెలుగు కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న మండల వీవోఏలు



పద్మనాభంలో ర్యాలీ చేస్తున్న వెలుగు వీవోఏలు

తగరపువలస: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆనందపురం మండల వీవోఏలు గురువారం ఆందోళన చేపట్టారు. ముందుగా ర్యాలీ నిర్వహించి మండల వెలుగు కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు మాసాలుగా ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించలేదన్నారు. కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, మూడేళ్ల కాలపరిమితిని రద్దు చేసి హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని కోరారు. రాజకీయ వేధింపులతో తొలగింపులు ఉండకూడదన్నారు. పనిభారం తగ్గించడంతోపాటు రూ.10 లక్షల సామూహిక బీమా సదుపాయం కల్పించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చందక పద్మకుమారి, మజ్జి శ్యామల, గుడివాడ

సమస్యలు పరిష్కరించండి

పద్మనాభం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెలుగు వీవోఏలు రెండో రోజు గురువారం ఆందోళన కొనసాగించారు. వెలుగు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం పద్మనాభంలో ర్యాలీ, పద్మనాభం జంక్షన్‌లో మానవ హారం నిర్వహించారు. తమకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్సురెన్స్ సౌకర్యం కల్పించాలని, రాజకీయ వేధింపులు లేకుండా చూడాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని, వేతనాల బకాయిలను తక్షణమే చెల్లించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం అధ్యక్షురాలు కె.కంచమ్మ, కార్యదర్శి ఆర్.రామలక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పెద్దిపాలెం, పాడుగుపాలెం, గుడిలోవ, చందక, గొట్టిపల్లి, వెంకటాపురం, కుసులవాడ, బీపీ కళ్లాలు, దుక్కవానిపాలెం, ఆనందపురం, బోని, వేములవలస, పాలవలస, బాకూరుపాలెం, తర్లువాడ, లొడగలవానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భీమిలి టౌన్ పరిధిలో..

తగరపువలస: భీమిలి టౌన్, పాలిటెక్నిక్ కళాశాల ఫీడర్లలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ మేరకు బ్యాంకు కాలనీ, తాతాజీనగర్, ఎల్లమ్మపేట, మహలక్ష్మిపురం, రాజలింగంపేట, రేఖవానిపాలెం, రాయపాలెం, మరడపాలెం, మూలకుద్దు, భీమిలి స్మిత్ వీధి, జగనన్న కాలనీ, నేరెళ్లవలస కాలనీ, ఎస్‌వోఎస్ విలేజ్, భీమిలి టౌన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని సంబంధిత అధికారి తెలిపారు.

విదేశీ విద్యార్థులకు విశాఖ సురక్షితం



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ పోలీస్ కమిషనర్ అజిత, విదేశీ విద్యార్థులు

కొమ్మాది: వివిధ దేశాల నుంచి వచ్చి గీతంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న అంతర్జాతీయ విద్యార్థులు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను అర్థం చేసుకుని విద్యార్థులతో సాంస్కృతిక సంబంధాలను పెంచుకోవాలని డిప్యూటీ పోలీస్ కమిషనర్ వి.అజిత సూచించారు. గీతంలో నూతనంగా ప్రవేశం పొందిన విదేశీ విద్యార్థులకు గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. విదేశీ విద్యార్థులకు విశాఖ సురక్షితమైందని పేర్కొన్నారు. ప్రారంభంలో సిలబస్‌ను అర్థం చేసుకుని అధ్యాపకులను అనుసరిస్తూ తదనంతరం బాహ్య ప్రపంచంపై దృష్టి సారించాలని అవగాహన కల్పించారు.

పాఠశాలలో డైనింగ్ హాల్ ప్రారంభం

తగరపువలస: భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం ఎంపీపీ పాఠశాలలో దివీస్ లేబరేటరీ రూ.4.02 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, పాత్‌వేలను గురువారం ఎంపీడీవో హనుమంతరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో జి.శివరాణి, దివీస్ సీఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, సిబ్బంది ఎ.శ్రీనివాస్, కె.నరసింహ, ఎస్.కనకరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మేరుగు ఎల్లాజీ, గ్రామపెద్దలు అప్పారావు, ముసలయ్య, ప్రధానోపాధ్యాయుడు సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వైద్యానికి ఆర్థిక సాయం



మురళికి రూ.25 వేలు అందిస్తున్న శ్రీనివాస సేవా సంఘం ప్రతినిధులు

పద్మనాభం: మండలంలోని వెంకటాపురంలో నివసిస్తున్న నిరుపేద కొల్లి మురళికి గుండె శస్త్ర చికిత్స చేయించుకోవడానికి శ్రీనివాసరావు సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కోన సన్యాసినాయుడు, కార్యదర్శి మెహర్, పూర్వ ఉపాధ్యక్షుడు ఎం.చిరంజీవి, సభ్యులు సారిక శంకరరావు, సంపంగి అప్పలరాజు, రౌతులపాలెం అయ్యప్ప స్వామి పీఠం గురుస్వామి ఎల్లయ్య స్వామి, కంది సత్యనారాయణ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది



మూలకుద్దులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

తగరపువలస: ఏటా 1.1 మిలియన్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. విపరీతమైన అలసట, తగ్గని జ్వరం, శరీరంలో గడ్డలు, చర్మం రంగులో మార్పు, రక్తస్రావం, నయం చేయలేని పుండ్లు ఈ వ్యాధి లక్షణాలన్నారు. శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, చక్కెరలు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, రెడ్ మీట్ క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయన్నారు. క్యాన్సర్ సోకితే టైప్–2 డయాబెటీస్, గుండె జబ్బులు సహా అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది హేమలత, స్వాతి విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. భీమిలి మండలం మూలకుద్దులో ఆరోగ్య సిబ్బంది క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

మరింత సమర్థంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

సాక్షి ఎఫెక్ట్..



కార్‌షెడ్ జంక్షన్‌లో రాంగ్ పార్కింగ్ వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో మరింత సమర్థవంతంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని విశాఖ నార్త్ జోన్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయి తెలిపారు. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కార్‌షెడ్, కొమ్మాది జంక్షన్, మధురవాడ అప్ బ్రిడ్జి, డీ–మార్ట్ తదితర ప్రదేశాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణను గురువారం ఆయన పరిశీలించారు. కార్‌షెడ్ జంక్షన్ వద్ద హైవే సర్వీస్ రోడ్డుపై పోలీస్ బీట్ బాక్స్ వెనుక నిబంధనలకు విరుద్ధంగా పార్కుచేసిన 18 వాహనాలకు రూ.1,050 చొప్పున జరిమానాలు విధించారు. తాళాలు వేసి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మధురవాడలో ట్రాఫిక్ జామ్‌తో నిత్యం ఇబ్బందులు, రోడ్లపైనే పార్కింగ్, హైవే సర్వీస్ రోడ్డును పార్కింగ్ ప్రదేశంగా మార్చేయడం తదితర ఇబ్బందులపై ‘ట్రాఫిక్ పద్మవ్యూహం’ అనే శీర్షికన గురువారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి సీఐ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మార్గంలో ద్విచక్ర వాహనాలు రాకపోకలకు మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. వాహనాలు రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చదువే ఆస్తి



పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని సత్కరిస్తున్న గాయత్రి కళాశాల యాజమాన్యం

కొమ్మాది: మన చదువే మన భవిష్యత్తుకు సరైన ఆస్తి అని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. రుషికొండ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో గురువారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన ప్రసంగించారు. బాల్యం నుంచే క్రమశిక్షణ, కృషి పట్టుదలతో విద్యను అభ్యసిస్తే ఉన్నతమైన అవకాశాలు దక్కుతాయన్నారు. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవను అలవరుచుకోవాలని సూచించారు. బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం సీపీని గాయత్రి విద్యాపరిషత్ ఉపాధ్యక్షుడు వి.దక్షిణామూర్తి, ప్రిన్సిపాల్ కె.ఎస్.బోస్ ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

6 వాహనాల సైలెన్సర్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లు, సైలెన్సర్లతో సీఐ సాయి, సిబ్బంది

మధురవాడ: నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు మార్చి ప్రజలను శబ్ద కాలుష్యానికి, భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆకతాయిలపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. భీమిలి, పీఎం పాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 6 వాహనాల సైలెన్సర్లు, వాహనాలు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సాయి తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వాహన చోదకులను హెచ్చరించారు.

నెలాఖరు వరకు హిందీ పరీక్షల ఫీజు చెల్లింపునకు అవకాశం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచార సభ–చెన్నై ద్వారా 2025 ఫిబ్రవరిలో లోయర్, హయ్యర్ పరీక్షలు రాయగోరే విద్యార్థులు ఈ నెలాఖరులోగా ఫీజులు చెల్లించాలని భీమిలి ఆదర్శహిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, రాష్ట్ర భాష, ప్రవేశిక, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలు, పుస్తకాలు, ఉచిత శిక్షణ కోసం 89856 47419, 89858 97419 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గ్రామ సభకు 298 దరఖాస్తులు



కోరాడలో నిర్వహిస్తున్న గ్రామ సభ

పద్మనాభం: మండలంలోని కోరాడలో గురువారం రీసర్వేలో తప్పుల సవరణ కోసం నిర్వహించిన గ్రామ సభలో 298 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. పేర్లు, విస్తీర్ణం సరిచేయాలని రైతులు కోరారు. హెచ్‌డీటీ చంద్రశేఖర్, రీసర్వే డీటీ వరలక్ష్మి ఈ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోరాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఏసీపీగా తిరుపతిరావు బాధ్యతల స్వీకరణ



మధురవాడ: జీవీఎంసీ జోన్–2 టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీగా పి.తిరుపతిరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శభనాస్‌శాస్త్రి కంచరపాలెం జోన్‌కి బదిలీ కావడంతో ఆయన స్థానంలో భీమిలి జోన్ నుంచి బదిలీపై వచ్చి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కొద్ది రోజులు ఇక్కడ టీపీవోగా కూడా పనిచేశారు. ఈ సందర్భంగా తిరుపతిరావును పలువురు అధికారులు, సిబ్బంది అభినందించారు.

శ్రీబాసరలో దూరవిద్య కేంద్రానికి అనుమతి



దూరవిద్య డైరెక్టర్ విజయమోహన్ నుంచి అనుమతి పత్రం తీసుకుంటున్న పూడి రమేష్

తగరపువలస: ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి దూరవిద్య ద్వారా బీఏ, బీకాం, బీఎస్సీ వంటి యూజీ పరీక్షలు, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ వంటి పీజీ కోర్సులు అభ్యసించాలనుకునే వారు తగరపువలసలోని శ్రీబాసర డిగ్రీ కళాశాలను కేంద్రంగా ఎంచుకోవచ్చు. ఈ మేరకు గురువారం ఏయూ దూరవిద్య డైరెక్టర్ విజయమోహన్ శ్రీబాసర చైర్మన్ పూడి రమేష్‌కు అనుమతి పత్రం అందించారు. ఉత్తరాంధ్రలో వివిధ ఉపాధి పనులను చేసుకుంటూ డిగ్రీ చదవాలనుకునే వారు కోర్సులు, అడ్మిషన్లు, పరీక్ష షెడ్యూల్ గురించి తమ వద్ద తెలుసుకోవచ్చని రమేష్ చెప్పారు. ఈ దూరవిద్య కేంద్రం ప్రారంభోత్సవంలో జోనల్ ప్రిన్సిపాల్ వి.వి.డి.రమేష్, డీన్ మజ్జి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ చప్పా సురేష్, డిఫెన్స్ ప్రిన్సిపాల్ మహేశ్వర రెడ్డి, ఏవో కేశవ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్యం గాలికి..



గిడిజాలలో అనారోగ్యంతో ఆవుదూడ

తగరపువలస: భీమిలి, ఆనందపురం మండలాల్లో పశువులకు సకాలంలో వైద్యం అందక వాటి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. స్థానిక ఆస్పత్రుల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం, పశువైద్య శాఖ టోల్ ఫ్రీ నంబర్ 1962కు ఫోన్ చేసినా స్పందించడం లేదు. ఆనందపురం మండలం గిడిజాలలో షిణగం శ్రీను అనే రైతుకు చెందిన ఆవుదూడ అనారోగ్యంతో ఉన్నా.. ఎవరు స్పందించడం లేదని బాధిత రైతు వాపోయారు. వాస్తవానికి ఏ ప్రభుత్వ పశువుల ఆస్పత్రిలో కూడా వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండటం లేదు. పశుగణన, జిల్లా కార్యాలయంలో సమావేశాలు, వ్యాక్సిన్లు వేయడానికి ఆన్ డ్యూటీ పేరుతో బయట సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. శివారు గ్రామాల్లో వైద్యశాలలే తెరవడం లేదని, తెరచినా ఎవరో వైద్యం తెలియని వ్యక్తులను ఉంచి ఫోన్ ద్వారా వైద్యం అందిస్తున్నట్టు పాడిరైతులు ఆరోపిస్తున్నారు. కొందరైతే ప్రైవేట్ డెయిరీ యాజమాన్యాల సేవలో తరిస్తూ పాడిరైతులను గాలికి వదిలేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో కూడా పశు వైద్య సహాయక సిబ్బంది ఫీల్డ్ పేరుతో నిత్యం అందుబాటులో ఉండటం లేదని రైతులు వాపోతున్నారు. పశుగణన కూడా వాస్తవంగా చేపట్టకుండా గత లెక్కలు సర్దుబాటు చేయడం, కాకిలెక్కలు నమోదు చేస్తున్నట్టు ఎక్కువగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పశు సంవర్ధక శాఖలో ప్రక్షాళన జరగాలని పాడిరైతులు కోరుతున్నారు.

స్పోర్ట్స్ పాలసీకి టైం బాండ్ అవసరం



మాట్లాడుతున్న డీఎస్‌డీవో జూన్ గాలియేట్

మధురవాడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన స్పోర్ట్స్ పాలసీపై పలువురు క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూనే.. దీని అమలుకు టైం బాండ్ ఉండాలని కోరారు. కొమ్మాది శాప్ స్టేడియం, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో డీఎస్‌డీవో జూన్ గ్యాలియేట్ గురువారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఆటల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ పెంపుపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇతర క్రీడాకారులు మాత్రం జిల్లాలో స్టేడియం కల సాకారం కావాలి, ప్రతి మండలంలో కూడా మైదానాలు నిర్మించాలని కోరారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం, మౌలిక సదుపాయాలు, క్రీడాకారులకు ఇన్సూరెన్స్, వైద్యం, కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ది ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కంచరాన సూర్యనారాయణ, అర్జున అవార్డు గ్రహీత ఎస్.జయరాం, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి నారాయణరావు, వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్‌కుమార్, మాజీ డీఎస్‌వో ఆనందలక్ష్మి, అంతర్జాతీయ స్కేటర్లు సాయిసహిత, డి.గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని పెయింటర్ దుర్మరణం



మృతుడు వంక భాస్కర్

తగరపువలస: ద్విచక్రవాహనంతో ఆగి ఉన్న గ్యాస్ సిలిండర్ల లారీని ఢీకొని పెయింటర్ మృతి చెందాడు. ఈ ఘటన ఆనందపురం మండలం పెద్దిపాలెం జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. సీఐ సీహెచ్.వాసునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం బీసీ కాలనీకి చెందిన వంక భాస్కర్ ఆనందపురం మండలం చందకలో పెయింటింగ్ పనులకు వచ్చి గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో తిరుగుపయనమయ్యాడు. పెద్దిపాలెం వద్ద జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో సంఘటన స్థలంలో మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ జి.సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.